# పర్యాటక హబ్‌గా కృష్ణాతీరం



సోమశిల వద్ద కృష్ణానదికి హారతినిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- సోమశిల వద్ద కృష్ణానదికి హారతి ఇచ్చిన మంత్రి
- 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం ప్రారంభం

కొల్లాపూర్, ఆగస్టు 5 : నల్లమల అందాల మధ్య కృష్ణా నది అలల సవ్వడితో ఆధ్యాత్మికం, పర్యాటకం కలబోతగా ఉన్న కొల్లాపూర్ ప్రకృతి అందాలను ప్రపంచానికి తెలియజేసేందుకు పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతున్నట్లు ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం' ప్రారంభోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ సంతోష్‌తో కలిసి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిలలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంసరక్షించాలని మంత్రి జూపల్లి కోరారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలతోపాటు గ్రామ, పట్టణాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం మంత్రి జూపల్లి, కలెక్టర్ సంతోష్ కష్ణమ్మకు పూజలు చేసి హారతినిచ్చారు. అంతముందు సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమశిల వద్ద పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలు చేపట్టాల్సిన పనులపై ప్రణాళికల రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో నాగరాజు, అధికారులు పాల్గొన్నారు.

## అలసత్వం వహిస్తే చర్యలు

కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినులకు మెరుగైన విద్యతోపాటు నాణ్యమైన భోజనం అందించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను హెచ్చరించారు. పెంట్లవెల్లి కేజీబీవీలో కలుషిత ఆహారం తిని విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనను మంత్రి సీరియస్‌గా తీసుకున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని సోమవారం కొల్లాపూర్ నియోజకవర్గంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కేజీబీవీ విద్యార్థినులు, బోధన, బోధనేతర సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి జూపల్లి పాల్గొని దిశానిర్దేశం చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి వినియోగించే నిధులను పాఠశాలలు, హాస్టల్స్‌లో మెరుగైన సౌకర్యాల కోసం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ సంతోష్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.5వేల కోట్లతో కల్వకుర్తిని అభివృద్ధి చేశాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- కేసీఆర్ హయాంలో ప్రారంభించిన పనులు ఎందుకు రద్దు చేశారు
- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ, ఆగస్టు 5 : కల్వకుర్తి నియోజకవర్గాన్ని రూ.5వేల కోట్లతో అభివృద్ధి చేశామని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రారంభోత్సవాలు చేసిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు రద్దు చేసిందో ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఏమైనా అభివృద్ధి పనులు వద్దని చెప్పారా? మరి ఎందుకు రద్దు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 200 రోజులు గడుస్తున్నా.. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా నెరవేర్చలేదని ఆరోపించారు. ఉచిత బస్సు పేరుతో పల్లెలకు ఆర్టీసీ బస్సులు లేకుండా చేశారని మండిపడ్డారు. రుణమాఫీ ఒకే విడుతలో చెల్లిస్తామని చెప్పి రైతులను మోసం చేశారని మండిపడ్డారు. పాడి రైతులకు నాలుగు నెలల బిల్లులు చెల్లించకపోతే ఎలా అని వెంటనే బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం వెల్దండలో బీఆర్‌ఎస్ కార్యకర్త జంగిలి ప్రసాద్ తల్లి మొగులమ్మ మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, యాదగిరి, ఆనంద్, రవికుమార్, శేఖర్, శ్రీనుముదిరాజ్, శ్రీను, అశోక్ ఉన్నారు.

# పచ్చదనం బ్యానర్‌లో ఎమ్మెల్సీ ఫొటో ఏదీ?





హన్వాడ : ఎమ్మెల్సీ ఫొటో లేని బ్యానర్

హన్వాడ, ఆగస్టు 5 : మండలంలోని కిష్టంపల్లిలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన బ్యానర్‌పై ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ఫొటో లేకుండానే కార్యక్రమం నిర్వహించారు. బ్యానర్‌పై ఎమ్మెల్సీ ఫొటో ఎందుకు పెట్టలేదని గ్రామ కార్యదర్శితోపాటు పలువురు అధికారులను అడుగగా ఎలాంటి సమాధానం రాకపోవడంతో కార్యక్రమాన్ని నిలిపివేశారు. ఇదే విషయమై ఎంపీడీవోకు ఫోన్ చేస్తే ఎలాంటి సమాధానం ఇవ్వలేదని మాజీ సర్పంచ్ సరస్వతి, సింగిల్ విండో చైర్మన్ వెంకటయ్య తెలిపారు. బ్యానర్‌పై ఎమ్మెల్సీ ఫొటో ఉంటేనే కార్యక్రమం చేపట్టాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించడంతో అధికారులు కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు.

# ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలి

- కేజీబీవీ ఎదుట ప్రతిపక్షాల ధర్నా



కేజీబీవీ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

పెంట్లవెల్లి, ఆగస్టు 5 : మండలకేంద్రంలోని కేజీబీవీలో ఫుడ్ పాయిజన్ కావడంతో 50 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని, ఇందుకు కారుకులైన ఎస్‌వోపాటు పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కేజీబీవీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు డాక్టర్ బ్రహ్మం, బీఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకుడు దాసు, బీజేపీ జిల్లా నాయకుడు మూలే భరత్‌చంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు సైతం మంచి ఆహారాన్ని అందించడంలో విఫలం అయిందనడానికి కేజీబీవీ విద్యార్థినులు అస్వస్థతకు గురవ్వడమే నిదర్శనం అన్నారు. అసలు విద్యార్థుల బాగోగులు చూసుకొనేందుకు విద్యాశాఖ మంత్రి ఉంటే కదా.. అంటూ చురకులంటించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి విద్యాశాఖకు మంత్రిని నియమించి గురుకుల, కస్తూర్బా పాఠశాలలతోపాటు హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న ఎస్సై రామన్‌గౌడ్ అక్కడికి చేరుకొని ఉన్నతాధికారులతో మాట్లాడిన అనంతరం జిల్లా కలెక్టర్ పాఠశాలకు వస్తున్నారు అని సర్ది చెప్పడంతో వారు ధర్నా విరమించుకున్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు ఖలీల్, ప్రసాద్, మూలే వెంకటేశ్వర్లు, కల్పనారెడ్డి, విద్యార్థి నాయకుడు తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



వనపర్తి కలెక్టరేట్‌లోని విద్యాశాఖ అధికారి కార్యాలయం

బడుల పర్యవేక్షణ

# గోవిందా..!

- మూడు జిల్లాలకు కలిపి ఒకే డీఈవో
- 14 మండలాల్లో ఆరుగురు ఇన్‌చార్జి ఎంఈవోలే..
- కొరవడిన జిల్లా అధికారుల పర్యవేక్షణ
- ప్రశ్నార్థకంగా పేద విద్యార్థుల భవిష్యత్
- నీరుగారుతున్న విద్యా ప్రమాణాలు

వనపర్తి, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : ఈ విద్యా సంవత్సరం ప్రారంభమై 53 రోజులు కాగా.. వీటిలో ఇంచుమించు 45 రోజుల పని దినాలున్నాయి. ఈ రోజుల్లో పట్టుమని నాలుగు పాఠశాలలు కూడా డీఈవో పర్యవేక్షణ జరపలేదంటే ఆయన పనితీరుకు దర్పణం పడుతుంది. జిల్లాలో 365 ప్రాథమిక పాఠశాలలుంటే, మరో 60 ప్రాథమికోన్నత పాఠశాలలు, 102 జిల్లా పరిషత్ పాఠశాలు ఉన్నాయి. వీటిలో 2,420 మంది ఉపాధ్యాయులు పని చేస్తుండగా, 32,895 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇలా పర్యవేక్షణ లోపంతో విద్యార్థుల భవిష్యత్ అంతా 'గోవింద' అన్న చందంగా వనపర్తి విద్యావ్యవస్థ తయారైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## నిద్రావస్థలో విద్యా వ్యవస్థ

వనపర్తి జిల్లాలో విద్యావ్యవస్థ నిద్రావస్థలో ఉన్నది. అధికారుల పర్యవేక్షణ లేక తూతూ మంత్రంగా బడుల నిర్వహణ నడుస్తున్నది. కనీస పర్యవేక్షణ లేకపోవడంతో ఉదాశీన వైఖరి ప్రభుత్వ పాఠశాలల్లో కనిపిస్తుంది. ఎప్పుడో ఒకసారి పాఠశాలకు వెళ్లినా.. కేవలం మధ్యాహ్న భోజనం దగ్గరకు వెళ్లడం ఫొటోలు దిగడం తప్పితే, ఇసుమంత కూడా ఉపయోగం ఉండడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ తనిఖీలో జరిగేదంతా ఫొటోల తంతు కోసమేనన్నట్లు ఇటు అధికారులు... అటు ఉపాధ్యాయులు.. విద్యార్థులు కూడా ఫిక్స్ అయిపోయారు. దీని వల్ల ఎలాంటి ప్రయోజనం ఒనగూరడం లేదు. దేశ భవిష్యత్ తరగతి గది నుంచే ప్రారంభమవుతుందని గ్రామ సర్పంచ్ మొదలుకొని ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రుల వరకు, గ్రామ కార్యదర్శులు నుంచి కలెక్టర్ వరకు సందర్భం వచ్చినప్పుడల్లా పదే.. పదే గుర్తు చేస్తారు. ఇవన్నీ మాటలకే పరిమితమవుతున్నాయి. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సైతం ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులతో హైదరాబాద్‌లో నిర్వహించిన మీటింగ్‌లో ఇదే విషయం చెప్పారు. విద్యా వ్యవస్థపై బాధ్యతగా వ్యవహరించాలని, ఈ ఏడాది రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో ఏకంగా రెండు లక్షల అడ్మిషన్లు తగ్గిపోయాయని సీఎం సైతం ఆందోళన వ్యక్తం చేయడం ప్రాధాన్యతను సంతరించుకున్నది.

## మూడు చోట్ల బాధ్యతల్లో డీఈవో..

వనపర్తి జిల్లా విద్యాశాఖ అధికారిగా గోవిందరాజులు కొనసాగుతున్నారు. ఈయన రెగ్యులర్ పోస్టు మహబూబ్‌నగర్‌లోని బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. దీంతోపాటు మొదటి ఇన్‌చార్జి డీఈవోగా నాగర్‌కర్నూల్ జిల్లాతోపాటు అదనంగా వనపర్తి జిల్లా బాధ్యతలు సైతం నిర్వహిస్తున్నారు. మూడు చోట్లా విధులను నిర్వహిస్తున్న డీఈవో ఎక్కడ కూడా న్యాయం చేయడం లేదు. ఈ క్రమంలో సీఎం చెప్పినట్లు తరగతి గదిలో సిద్ధమయ్యే దేశ భవిష్యత్ మరింత అంధకారంలోకి వెళ్తున్నది. వారం రోజుల పనిదినాల్లో ఓ రెండు, మూడ్రోజులు వనపర్తికి కేటాయించినా అది అంతంత మాత్రంగానే ఉన్నది. దీంతో వనపర్తి జిల్లా విద్యావ్యవస్థ నిద్రావస్థకు చేరుకున్నది. ఒక జిల్లా అధికారి రాకపోకల వ్యవహారమే 'ఆయా రాం.. గయా రాం' అన్న చందంగా ఉంటే.. ఇక ఆ అధికారిపై ఆధారపడ్డ వ్యవస్థ ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు.

## 45 రోజుల్లో 4 బడులు కూడా..

వనపర్తి విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందనడానికి అధికారుల పర్యవేక్షణే తార్కాణంగా నిలుస్తున్నది. ఈ ఏడాది బడులు ప్రారంభమై 53 రోజులు గడిస్తే.. అందులో 45 రోజుల వరకు పని దినాలు ఉన్నాయి. వీటిలో కేవలం నాలుగు బడులను కూడా డీఈవో పరిశీలించలేదంటే, ఆయన పనితీరు ఎలా ఉందో తెలిసిపోతుందని పలువురు ఆరోపిస్తున్నారు. పాఠశాలల ప్రారంభంలో విద్యా వ్యవస్థను సరైన క్రమ పద్ధతిలో మానిటరింగ్ చేయడం వల్ల చివరి దాకా అదే వాతావరణం కొనసాగే పరిస్థితులుంటాయి. కేవలం వచ్చామా.. వెళ్లామా.. అన్నట్లు ఎప్పుడో ఒకసారి ఇలా బడులకు వెళ్లడం వల్ల పెద్దగా ఒరిగేదేమీ ఉండదని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. పర్యవేక్షణకు వెళ్లినప్పుడు సైతం కేవలం ఫొటోల వరకే అన్నట్లు ఉండటం వల్ల ప్రయోజనం ఏముంటుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విద్యార్థుల సామర్థ్యం.. అప్పటి వరకు జరిగిన బోధన తీరు తదితర వాటిపై మొక్కుబడిగా వ్యవహరించడం వల్లే ప్రభుత్వ పాఠశాలల్లో అనుకున్న ప్రామాణికాలతో కూడిన విద్య విద్యార్థులకు అందడం లేదన్న విమర్శలు లేకపోలేదు. జిల్లాలోని కొత్తకోట మండల కేంద్రంతోపాటు పెద్దమందడి మండలం మద్దిగట్ల, గోపాల్‌పేట పాఠశాలలకు మాత్రమే ఇప్పటి వరకు జిల్లా విద్యాశాఖాధికారి వెళ్లినట్లు సమాచారం. ఇక వీపనగండ్లకు పాఠశాలలు ప్రారంభం కానప్పుడు వెళ్లడం, చిన్నంబాయికి మంత్రి జూపల్లి పర్యటన సందర్భంలో వెళ్లి వచ్చారే తప్పా.. మరోటి లేదన్న గుసగుసలున్నాయి. ఇంకా పది మండలాల మొఖం ఇప్పటి వరకు చూడలేదన్న విద్యార్థుల తల్లిదండ్రులే అంటున్నారు.

## 14 మండలాలకు ఆరుగురు ఎంఈవోలే..

మూడు చోట్ల కొలువైన డీఈవో పరిస్థితి ఇలా ఉంటే.. అందుకు ఎంఈవోలు కూడా తీసిపోరు అనే చందంగా ఒక్కొక్కరికీ రెండు మూడు మండలాల అదనపు బాధ్యతలు ఉన్నాయి. జిల్లా అధికారి సక్రమంగా అందుబాటులో లేనప్పుడు ఇక కిందిస్థాయి పర్యవేక్షణ ఎలా ఉంటుందన్నది ప్రత్యేకంగా చెప్పేదేం ఉండదు. జిల్లాలో 14 మండలాలకు కేవలం ఆరుగురు ఇన్‌చార్జి ఎంఈవో ఉన్నారు. వీరంతా హెచ్‌ఎం బాధ్యతలను నిర్వహిస్తూ అదనపు బాధ్యతల్లో కొనసాగుతున్నారు. జిల్లాలో ఒక్కగానొక్క రెగ్యులర్ ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ ఉండగా ఆయన కూడా శంషాబాద్‌కు ఇటీవలే బదిలీపై వెళ్లారు. ఇక లక్ష్మణ్‌నాయక్ బాధ్యతలున్న మూడు మండలాలు పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబాయిలకు కనీసం ఇన్‌చార్జీలను కూడా నియమించే పరిస్థితి లేకుండానే అతడిని రిలీవ్ చేశారు. ఇంకా మిగిలిన చోట్ల ఒక్కొక్క ఇన్‌చార్జికి రెండు, మూడు మండలాలను సైతం అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ ఇన్‌చార్జి ఎంఈవోలు సహితం వారు పనిచేస్తున్న మండలంలోని బడులను మాత్రమే తనిఖీలు చేస్తున్నారు. ఇక పక్క మండలాలకు వెళ్లి పర్యవేక్షణ జరిపిన దాఖలాలు నామమాత్రంగానే ఉన్నాయి. ఈ పరిస్థితిలో సర్కారు బడుల్లో విద్యాప్రమాణాలు ఎలా ఉన్నాయో అర్థమవుతుంది. జిల్లాలో డీఈవో, ఎంఈవోల వ్యవస్థ పటిష్టంగా లేనప్పుడు ఇక పంతుళ్లు.. పాఠశాలలు పటిష్టంగా ఉంటాయని అనుకొనే అవకాశమే లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం వనపర్తి జిల్లాకు రెగ్యులర్ డీఈవోతోపాటు అన్ని మండలాలకు ఎంఈవోలను నియమించి మెరుగైన విద్యాబోధన జరిగేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదిలా ఉంటే.. పాఠశాలల పర్యవేక్షణ తదితర అంశాలపై డీఈవోను సంప్రదించడం కోసం కార్యాలయానికి వెళితే.. నాగర్‌కర్నూల్‌కు వెళ్లారని అక్కడున్న సిబ్బంది తెలిపారు. అలాగే ఫోన్‌లో ప్రయత్నించినా ఆయన స్పందించలేదు.

# వేతనాల కోసం ఎదురుచూపు !

- నిలిచిపోయిన రూ.8 కోట్ల చెల్లింపులు
- కల్వకుర్తి ఎస్‌టీవో పరిధిలో సాంకేతిక సమస్య
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

కల్వకుర్తి, ఆగస్టు 5 : ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి సబ్‌ట్రెజరీ పరిధిలోని ఐదు మండలాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు జూలై మాసానికి సంబంధించి జీతాలు రావాల్సి ఉన్నది. అయితే 5వ తేదీ (సోమవారం రాత్రి) వరకు కూడా బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోవడంతో ఎంప్లాయిస్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మండలాల పరిధిలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు దాదాపు రూ.8 కోట్లు వరకు వేతనాల ద్వారా ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నది .సాంకేతిక కారణాల దృష్ట్యా జీతాలు బ్యాంక్ ఖాతాల్లో పడలేదని సమాచారం. ట్రెజరీ అధికారులు, ఉపాధ్యాయుల సంఘాల నాయకులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించి జీతాల చెల్లింపునకు అన్ని మార్గాలు సుగమమైనప్పటికీ మరో కొత్త చిక్కు వచ్చినట్లు ఉద్యోగ సంఘం నాయకులు చెబుతున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి, సీఎం రేవంత్‌రెడ్డి వెంట అమెరికా పర్యటనలో ఉన్న కారణంగా కల్వకుర్తి ఎస్టీవో పరిధిలోని ఉద్యోగుల జీతాల చెల్లింపునకు ఇబ్బందిగా మారిందంటున్నారు. రూ.కోటి కంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సి వస్తే కచ్చితంగా ఆర్థిక శాఖ కార్యదర్శి అనుమతి అవసరం. ఈ నేపథ్యంలో ఆయనకు సమాచారం ఇచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఆయన ఆదేశాల మేరకే జీతాలు ఖాతాల్లో పడనున్నాయి. వేతనాలు రాకపోవడంతో పలువురు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

# బ్యాంకు ఎదుట రైతుల ఆందోళన




బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 5 : రైతులను మోసం చేసిన అధికారులు, మధ్యవర్తులపై చర్యలు తీసుకోవాలని మండలంలోని పెద్దకార్పాముల గ్రామంలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎదుట సోమవారం రైతులు ఆందోళన నిర్వహించారు. రైతుల ప్రమేయం లేకుండా రైతుల పేరుపై బ్యాంకులోని కొందరు అధికారులు, మధ్య దళారులు కలిసి రైతుల పేరుపై రుణాలను తీసుకున్నారు. బ్యాంకులో రుణం తీసుకోకపోయిన అప్పు ఉన్నట్లు రైతులకు నోటీసులు రావడంతో వారు అవాక్కయ్యారు. దీంతో తమకు న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సతీశ్ రైతులతో మాట్లాడుతూ మోసపోయిన రైతుల వివరాలను తెలుసుకుంటున్నామని, దీనిపై పూర్తి విచారణ నిర్వహించి సంబంధిత అధికారులు, దళారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# వడ్డీ పేరుతో బురిడీ

- రూ.20 కోట్లతో వ్యాపారీ పరారీ

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 5 : అధిక వడ్డీ ఆశ చూపి ఓ వ్యాపారీ బురిడీ కొట్టించిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకున్నది. బాధితుల కథనం మేరకు.. తెలకపల్లి మండలం నడిగడ్డ గ్రామానికి చెందిన జహీర్ చోటమియా అనే వ్యక్తి నాగర్‌కర్నూల్, నడిగడ్డ, తూడుకుర్తి గ్రామాలకు చెందిన 200 మంది నుంచి అధిక వడ్డీ ఆశ డబ్బులు తీసుకున్నారు. దాదాపు 20 కోట్ల వరకు వసూలు చేసి ఇక్కడి నుంచి పరారయ్యాడు. తర్వాత మోసపోయాయని విషయం తెలుసుకున్న బాధితులు న్యాయం చేయాలని కోరుతూ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. డబ్బులతో ఉడాయించిన జహీర్‌ను వెంటనే పట్టుకొని మా డబ్బులు తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.



నాగర్‌కర్నూల్ ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు



జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు

# కర్నూల్ బ్యాంకుల్లోని రుణాలు మాఫీ చేయాలి

- బీఆర్‌ఎస్ నేతలు, రైతుల విజ్ఞప్తి

గద్వాల అర్బన్, ఆగస్టు 5 : రైతు రుణమాఫీ విషయంలో గద్వాల, అలంపూర్ నియోజకవర్గానికి చెందిన రైతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఆయా బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు కూడా ప్రభుత్వం మాఫీ చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా కేంద్రం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బాసు హన్మంతునాయుడు మాట్లాడుతూ రైతుల రుణమాఫీ విషయంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులు కర్నూల్‌కు దగ్గరగా ఉన్నందున 30ఏండ్ల నుంచి ఆయా బ్యాంకుల్లో రుణాలు తీసుకుంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో పంట రుణమాఫీ చేసినప్పుడు కూడా రైతులకు వివిధ బ్యాంకుల్లో రుణమాఫీ అయ్యిందని గుర్తు చేశారు. అందుకే కర్నూల్ బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు కూడా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పల్లెపాడు శంకర్‌రెడ్డి, ఆత్మలింగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బస్వరాజ్, శ్రీరాములు, కురుమ పల్లయ్య, చందు తదితరులు ఉన్నారు.

# పర్దిపురంలో ఆర్టీసీ బస్సులు ఆపాలి



పర్దిపురంలో రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

- రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

అయిజ, ఆగస్టు 5 : ఆర్టీసీ బస్సులు నిలపకపోవడంతో విద్యార్థులు రోడ్డుపై బైఠాయించారు. అయిజ మున్సిపాలిటీ పరిధిలోని పర్దిపురం గ్రామం నుంచి నిత్యం వందలాది మంది విద్యార్థులు అయిజ, శాంతినగర్ పట్టణాలకు విద్యాభ్యాసం కోసం వెళ్తున్నారు. ఉదయం 7గంటల నుంచి రోడ్డుపై నిల్చున్నా బస్సులు నిలపకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు సమయానికి వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు వాపోయారు. ఆర్టీసీ అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోకపోవడంతో సోమవారం కర్నూల్-రాయిచూర్ జాతీయ రహదారిపై విద్యార్థులు బైఠాయించి వాహనాలను నిలిపివేశారు. పాఠశాలలు, కళాశాలల సమయాను కూలంగా అదనపు బస్సులు నడపడంతోపాటు కర్నూల్, శాంతినగర్ పట్టణాలకు వెళ్తున్న ప్రతి బస్సును పర్దిపురంలో నిలిపేలా చూడాలని తల్లిదండ్రులు, విద్యార్థులు ఆర్టీసీ అధికారులను డిమాండ్ చేశారు. దీనిపై ఆర్టీసీ అధికారులు స్పందిస్తూ పాఠశాల సమయాల్లో బస్సులు నిలిపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థులు దాదాపు గంటపాటు రోడ్డుపై బైఠాయించడంతో గంటసేపు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది.

### పురుగులన్నం పెడ్తుండ్రు

# ఫిర్యాదు చేస్తే కొడ్తుండ్రు

- తల్లిదండ్రులతో కన్నీరు పెట్టుకున్న కేజీబీవీ విద్యార్థినులు



పెంట్లవెల్లి కేజీబీవీ వద్ద తల్లిదండ్రులతో కన్నీరు పెట్టుకుంటున్న విద్యార్థినులు

పెంట్లవెల్లి, ఆగస్టు 5 : కొద్ది రోజులుగా మాకు పురుగుల అన్నం పెడుతున్నారు.. ఈ విషయాన్ని ఎస్‌వో స్వప్న మేడానికి ఫిర్యాదు చేస్తే గిన్నెతో కొట్టారని కస్తూర్బా గాంధీ పాఠశాలల విద్యార్థినులు సోమవారం వారి తల్లిదండ్రులుతో కంటతడి పెట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. ఆదివారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి కేజీబీవీలో 30 మంది విద్యార్థినులు ఫుడ్‌పాయిజన్‌కు గురై తీవ్ర అస్వస్థతకు గురై దవాఖానలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.. ఈ విషయాన్ని తెలుసుకున్న పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు విద్యాలయానికి చేరుకున్నారు. దీంతో 9వ తరగతికి చెందిన పలువురు విద్యార్థినులు వారి పేరెంట్స్ వద్ద బాధతో మాట్లాడారు. 'మాకు ఈ పాఠశాల వద్దు.. మీ వెంటే మేము వస్తాం.. అమ్మ..' అంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఈ దృశ్యం అక్కడున్న వారిని కలిచివేసింది. విద్యార్థులకు కనీసం నాణ్యమైన భోజనం అందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పాలన పేరుతో గద్దెనెక్కిన రేవంత్ సీఎం అయ్యాక విద్యాశాఖకు మంత్రిని నియమించలేదని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వానికి విద్యార్థుల బాధలు అర్థం కావడం లేదా.. అంటూ కన్నెర్ర చేశారు. కాగా కేజీబీవీకి చేరిన మీడియా ముందు మాకు పురుగుల అన్నం, కుళ్లిపోయిన కూరగాయలతో కూర చేసి పెడుతున్నారని వాపోయారు. ఎస్‌వో దృష్టికి తీసుకెళ్తే నేను పెట్టేది ఇది.. అంటున్నారని అన్నారు. కాగా విద్యాలయ ఎస్‌వోను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటులో రాలేదు. కాగా ఇన్‌చార్జిని వివరణ కోరగా తనకేమీ తెలియదని చెప్పింది.

## మళ్లా ఫుడ్ పాయిజన్

- కేజీబీవీలో15 మందికి అస్వస్థత

పెంట్లవెల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని విద్యార్థులకు మళ్లా ఫుడ్ పాయిజన్ అయ్యింది. దాదాపు 15 మంది విద్యార్థినులు, ఇద్దరు ఉపాధ్యాయురాలకు అస్వస్థతకు గురయ్యారు. సోమవారం రాత్రి 7 గంటలకు భోజనం చేశాక పలువురు అనారోగ్యానికి గురికాగా.. అక్కడే ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌లో చికిత్సలు అందించారు. ఈ విషయంపై వైద్యాధికారి రోహిత్‌ను వివరణ కోరగా ఇందులో తొమ్మిది మంది విద్యార్థులకు వైద్యం అందించినా తగ్గకపోవడంతో వారితోపాటు ఓ టీచర్‌ను మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో కొల్లాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు. కాగా మంత్రి, కలెక్టర్ విద్యాలయాన్ని సందర్శించినా తీరు మాత్రం మారలేదు.